17వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

గురువారం అక్టోబర్ 22 2026 | పేజీలు 8

## బీర్‌పూర్‌లో బెల్ట్ షాప్ వేలం నోటీసు కలకలం

### పంచాయతీ తీర్మానంపై పలు అనుమానాలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 21 :** జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో విడుదలైన హెచ్చరిక నోటీసు చర్చనీయాంశంగా మారింది. గ్రామ పంచాయతీ అధికారిక లెటర్ హెడ్, సర్పంచ్ సంతకంతో ఈ నోటీసు జారీ కావడం స్థానికంగా అనుమానాలకు తావిస్తోంది. నర్సింహులపల్లె పరిధిలో బెల్ట్ షాప్ నిర్వహణకు గ్రామ పంచాయతీ ద్వారా నిర్వహించిన టెండర్, వేలం పాటలో హక్కు పొందిన వ్యక్తి మాత్రమే నిబంధనలకు లోబడి షాప్ నిర్వహించాలని పేర్కొన్నారు. వేలంలో హక్కు పొందిన వ్యక్తి కాకుండా ఇతర వ్యక్తి బెల్ట్ షాప్ నిర్వహిస్తూ మద్యం విక్రయాలు చేయరాదు. ఒకవేళ అమ్మినచో రూ.50,000 జరిమానా విధించబడునని, సమాచారం ఇచ్చిన వ్యక్తికి జరిమానా నుండి రూ.10,000 బహుమానం ఇవ్వబడుతుందని ప్రకటించారు. అనధికారికంగా నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం ఇస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే-మిగతా 2లో

# గోదావరి చెంతకు దుర్గాదేవి అమ్మవారు













**చురకలు ప్రతినిధి, ఇబ్రహీంపట్నం అక్టోబర్ 21** జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండలంలోనీ ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, వేములకుర్తి, బర్దిపూర్, ములరాంపూర్, ఎర్దండి, కోమటి కొండా పూర్, వర్షకొండ, డబ్బ, అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, ఎర్రాపూర్, కేశాపూర్, కోజన్ కొత్తూర్ గ్రామాల్లో దేవి శరన్న వరాత్రి ఉత్సవాలు సందడిగా జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిషాసుర మర్దన ఘట్టాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో

-మిగతా 2లో

## పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం







### -ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు వెలకట్టలేనివి. -జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 21:** విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమర వీరుల సేవలు ఎప్పటికీ మరువలేనివని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవల ను కొనియాడారు. బుధవారం పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్క రించుకొని విధి నిర్వహణలో దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల సంస్మరణ పోలీస్ ఫ్లాగ్ దేను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆవరణ లోని పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, పోలీస్ అధికారులు, అమర వీరుల కుటుంబ సభ్యులతో కలిసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు భద్రత కల్పించడం, సమా జంలో శాంతిభద్రతలను కాపాడటం, విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడంలో పోలీసుల -మిగతా 2లో

## జగిత్యాలలో ఇసుక, మట్టి

# అక్రమ రవాణా అరికట్టాలి

### సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి లేఖ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 21:** జగిత్యాల జిల్లా కేంద్రంగా సాగుతున్న ఇసుక, మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని మాజీ మంత్రి, బీఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. గనుల శాఖ జగిత్యాల కేంద్రంగా సాండ్ బజార్, స్టాక్ పాయిం ట్ ఏర్పాటు చేసినా వినియోగదారులకు టన్ను రూ.1300, పన్ను, జీఎస్టీతో కలిపి రూ.1450 పడు తోంది. హోం డెలివరీ రూ.50 కలిపితే ట్రాక్టర్ లోడ్ 4 టన్నులకు రూ.6000 అవుతోందన్నారు. అదే గోదావరి నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ కేవలం రూ.4000లకే లభిస్తుండటంతో ఏడాది అయినా సాండ్ బజార్ లో కనీసం 5000 ఎంటిల ఇసుక కూడా అమ్ముడుపోలేదని, నెలకు సగటున 400 ఎంటిలు, 100 ట్రాక్టర్లే అమ్మకం జరుగుతోందన్నారు సాండ్ బజార్ ధర భారంగా ఉండటం, బయట మార్కెట్ లో రూ.4000-5000కే దొరకడంతో, జిల్లా కేంద్రానికి 10 కి.మీ లోపు వరద కాలువ మట్టి అందుబాటులో ఉన్నా విని యోగించుకోకుండా, జగిత్యాల పట్టణా నికి దగ్గర లోని నర్సింగాపూర్, మొతె, తిమ్మాపూర్, జాబితాపూర్, హన్మాజీపేట్, పోరండ్ల, తాటిపల్లి, మొరపల్లి గ్రామాల గుట్టలను అధికారిక టెండర్, తాత్కాలిక అనుమతి లేకుండా అక్రమ రవాణాతో, వాల్టా యాక్ట్ ఉల్లంఘనతో వేలాది వృక్షాలు తొలగిస్తూ పర్యావరణానికి హాని చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ రవాణా అరికట్టేందుకు సాండ్ బజార్ లో టన్ను ధర రూ.1300 నుంచి రూ.1000లకు తగ్గించాలని, పరిసర గ్రామాల గుట్టలను అధికారిక టెండర్ ద్వారా, తాత్కాలిక పర్మిట్లతో అనుమతించాలి. ఎస్సారెస్పీ వరద కాలువ మట్టిని మైనింగ్ సెస్ రుసుముతో అనుమతిస్తే స్థానిక అవసరాలు తీరి, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు.

## దుర్గాదేవి దీవెన అందరిపై ఉండాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 21 :** దుర్గాదేవి దీవెన అందరిపై భక్తులపై ఉండాలి అని రామగిరి మండలం కలవచర్ల సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి అన్నారు. బుధవారం రాత్రి దుర్గా యూత్ కల్వచర్ల వారి ఆధ్వర్యం లో అమ్మవారి నిమజ్జన ఊరేగింపులో కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి ఆమె పాడుతూ పాడుతూ అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల దీవెన ఉండాలని ఆ దుర్గామాత దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండి ఐశ్వర్యాలతో ఉండాలని ఆమె కోరారు. దీని మధ్యన కార్యక్రమంలో భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## విజయదశమి వేడుకలు

- **శాంతియుత వాతావరణంలో జరిగిన పండుగ సంబరాలు**
- **అలాయ్ బలాయ్ చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు**
- **గ్రామాల్లో ప్రత్యేక పూజలు, జమ్మి వృక్షానికి పూజలు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (21) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, వేములకుర్తి, బర్దిపూర్, ములరాంపూర్, ఎర్దండి, కోమటికొండాపూర్, వర్షకొండ, డబ్బా, అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, ఎర్రాపూర్, కేశాపూర్, కోజన్ కొత్తూర్ గ్రామాల్లో విజయదశమి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.ఉదయం గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు మైసమ్మ తల్లికి పూజలు చేశారు. సాయంత్రం గ్రామ అభివృద్ధి కమిటీలు, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో మైసమ్మ పూజలు, జమ్మి వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జమ్మి ఆకులను పరస్పరం పంచుకుంటూ పెద్దలు, చిన్నలు ఒకరికొకరు విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.అలాగే శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి పల్లకిని ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.

**అలాయ్ బలాయ్‌తో ఆత్మీయ పలకరింపులు..**

విజయదశమి సందర్భంగా ప్రజలు కులమతాలకు అతీతంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ అలాయ్ బలాయ్ చేసుకున్నారు. జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు అందిస్తూ ఆశీర్వాదాలు తీసుకున్నారు. స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వేడుకలు శాంతియుత వాతావరణంలో జరగడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల అభివృద్ధి కమిటీలు, ఆలయ కమిటీల సభ్యులు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**మొదటి పేజీ తరువాయి.....** పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదురైనా, కుటుంబాలకు దూరంగా ఉంటూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమయ్యే పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయమని తెలిపారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసు శాఖ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పోలీసు శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు సమాజం ఎల్లప్పుడూ అండగా నిలవాలని పేర్కొన్నారు.అనంతరం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ దేశ రక్షణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. విధి నిర్వహణలో ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధతతో పనిచేయడం ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది కర్తవ్యమని తెలిపారు.అప్రజల ఆస్తులు, ప్రాణాలను రక్షించడం, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల అరికట్టడం, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యతలని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసు శాఖను సంప్రదించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సత్వర న్యాయం, సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పారదర్శకంగా సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. పోలీసు శాఖపై ప్రజలకు నమ్మకం మరింత పెరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని కోరారు.పోలీసు అమరవీరుల ఆశయాలు, త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, వారి సేవలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేయడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమము అనంతరం పోలీసు కుటుంబ సభ్యులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, అమర వీర పోలీస్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి చెంతకు దుర్గాదేవి అమ్మవారు

**మొదటి పేజీ తరువాయి....**

దుర్గాదేవి మండపాల వద్ద మహిషాసుర మర్దన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవిని మహిషాసుర మర్దినిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి నామస్మరణతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**అంగరంగ వైభవంగా అమ్మవారి శోభాయాత్ర...**

ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఏర్పాటు చేసి గ్రామాల్లో అంగరంగ వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా సాగిన అమ్మవారి ఊరేగింపులో మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి శోభాయాత్ర సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారుల ప్రదర్శనలు, డప్పుచప్పుళ్లు, భక్తి గీతాలు భక్తులను అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు గ్రామస్తులు ఆసక్తి చూపడంతో ప్రధాన వీధుల్లో సందడి నెలకొంది.మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఇళ్ల ముందు, వీధుల వెంట వేచి ఉండి అమ్మవారికి హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి నామస్మరణతో గ్రామాల ప్రధాన వీధులు మార్మోగాయి. భక్తుల జయజయధ్వానాల మధ్య శోభాయాత్ర ముందుకు సాగింది.

**ఆకర్షణీయంగా అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...**

అమ్మవారి శోభాయాత్ర,వేములకుర్తి గ్రామంలో బజరంగ్దళ్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నిమజ్జన కార్యక్రమంలో అతిపురతన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా సంస్కృతిక విభాగం కోసం ఏర్పాటుచేసి ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులను విశేషంగా అలరించాయి. డప్పుచప్పుళ్లు, భక్తి గీతాలు, వివిధ కళారూపాల ప్రదర్శనలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువత, భక్తులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. మహిషాసుర మర్దన ఘట్టాన్ని తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది.

**అమ్మవారి మహిషాసుర మర్దనం..**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మహిషాసుర మర్దన ఘట్టాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా భావించే ఈ కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా నిర్వహించారు. మహిషాసురుడిని దుర్గాదేవి సంహరించిన ఘట్టాన్ని ప్రదర్శించడంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పర్వదినాన్ని జరుపుకుంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**గోదావరి తీరానికి చేరిన అమ్మవారు...**

శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో అమ్మవారి విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చెరువులతో పాటు గోదావరి నదిలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ప్రత్యేక వాహనాలపై అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లిన భక్తులు నిమజ్జన సమయంలో పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. గోదావరి తీరంలో భక్తుల సందడి కనిపించింది. అమ్మవారి ఆశీస్సులతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని, ప్రజ లందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు.

### ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల

# సమస్యల పరిష్కారానికి కృషి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 21:** నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న డాక్టర్లు, వివిధ క్యాడర్ల సిబ్బంది వేతన సవరణ, పీఆర్సీ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ బుధ వారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం ను యూపీఏ హయాంలో మన్మోహన్ సింగ్ ప్రారంభించారని, జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో సహకరించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగులకు 1, 2 తేదీల్లోనే జీతాలు ఇస్తోందన్నారు. తమ డిమాండ్లను సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### బీర్‌పూర్‌లో బెల్ట్ షాప్

# వేలం నోటీసు కలకలం

**మొదటి పేజీ తరువాయి....**

ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హెచ్చరించారు. తెలంగాణ ఎక్సైజ్ నిబంధనల ప్రకారం రాష్ట్రంలో బెల్ట్ షాపులు నడపడం పూర్తిగా చట్టవిరుద్ధం కాగా, మరి గ్రామ పంచాయతీ స్వయంగా వేలం నిర్వహించి హక్కులు ఎలా కల్పిస్తుందని, ఎక్సైజ్ చట్టాలకు విరుద్ధంగా తీర్మానం చేయడం పంచాయతీరాజ్ చట్ట నిబంధనలకు విరుద్ధమని, రూ.50 వేల జరిమానా, రూ.10 వేల బహుమతి అని పేర్కొనడం మద్యం వ్యాపారాన్ని పంచాయతీయే సమర్థిస్తూ గుత్తాధిపత్యం చేస్తున్నట్లు కాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై మండల స్థాయి అధికారులు, ఎక్సైజ్ శాఖ స్పందించి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీర్ పూర్ మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# సీనియర్ సిటిజెన్స్ దసరా సమ్మేళనం



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 21 :** తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో దసరా సమ్మేళనం, ఆలయ్ బలయ్ కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో బతుకమ్మ పోటీల్లో,దసరా క్రీడల్లో విజేతలకు మాజీ మున్సిపల్ చైర్మన్ జీ ఆర్ దేశాయ్, రిటైర్డ్ జిల్లా అటవీ శాఖాధికారి పూసాల అశోక్ రావు చేతులమీదుగా బహుమతులు అందజేశారు.అనంతరం మత సామరస్యానికి కృషి చేస్తున్న సీనియర్ సిటిజెన్లను సన్మానించారు.జమ్మి ఆకులు పంచుకుంటూ హిందూ,ముస్లిం, క్రిస్టియన్ భాయ్,భాయ్ అంటూ ఆలయ్,బలయ్ చేసుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి లో సర్వమత సమ్మేళనం భావనతో అందరం ఒక్కటే అనేసందేశం సీనియర్ సిటిజెన్స్ తరపున తెలుపడానికి రాష్ట్ర అధ్యక్షులు పోతు నర్సింహా రావు సూచనలతో దసరా పండుగ సందర్భంగా ఆలయ్, బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్,ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాతం,రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సి. హన్మంత్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం విజయ్,అశోక్‌రావు,ఎం.డి. యాకూబ్, కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు వొజ్జల బుచ్చి రెడ్డి, జగిత్యాల డివిజన్ అధ్యక్షులు బి. రాజేశ్వర్, కార్యదర్శి రాజ్ గోపాల్ చారి,ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షులు కండ్ల గంగాధర్, బుగ్గారం అధ్యక్షులు దుబ్బేశం, మల్యాల అధ్యక్షులు ఎం. డి యాకుబ్, గొల్లపల్లి అధ్యక్షులు వీరారెడ్డి, జగిత్యాల పట్టణ అధ్యక్షులు మానాల కిషన్,కార్యదర్శి సింగం గంగాధర్, పుప్పాల నర్సింగా రావు,సింగం భాస్కర్, దేవిడ్,కరుణ, జలజ,విజయలక్ష్మి,సింగం పద్మ,జిల్లా, డివిజన్ల,మండలాల, గ్రామాల సీనియర్ సిటిజెన్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కోరుట్లలో కత్తితో హత్యాయత్నం..నిందితులు అరెస్ట్..

**-రిమాండ్‌కు తరలించిన కోరుట్ల పోలీసులు**




**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 21 :** దసరా పండుగ సందర్భంగా జరిగిన గొడవ నేపథ్యంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన ముగ్గురు నిందితులను కోరుట్ల పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గుద్దేటి రాజేందర్ (43) తన కాలనీలో దుర్గామాత అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌నగర్ కాలనీకి చెందిన కిరణ్ (19), అజయ్ (19)లతో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 21న తెల్లవారుజామున సుమారు 3 గంటలకు కిరణ్, అజయ్‌లు తమతో పాటు జ్ఞానదీప్ (20)ను తీసుకుని అర్బన్ కాలనీలోని దుర్గామాత ఆలయం వద్దకు వచ్చి రాజేందర్‌తో గొడవకు దిగారు. ఈ క్రమంలో కిరణ్,అజయ్‌లు రాజేందర్‌ను పట్టుకోగా, జ్ఞానదీప్ తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. దీంతో రాజేందర్ ఎడమ భుజం, మెడ ఎడమ వైపు గాయాలయ్యాయి. స్థానికులు నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నించగా, వారు కత్తితో బెదిరించి అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కోరుట్ల పోలీసులు నిందితులు కిరణ్, అజయ్, జ్ఞానదీప్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.పండుగల సమయంలో ప్రజలు సంయమనం పాటించాలని, గొడవలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. తిరుపతి, సబ్‌ఇన్‌స్పెక్టర్ జి. శ్యామ్ రాజ్ తెలిపారు.

# ఘనంగా దసరా వేడుకలు

**-అశేష జనాల మధ్య రావణ దహనం**



**చురకలు విలేకరి, రాయికల్, అక్టోబర్ 21 :** చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించే విజయ దశమి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాయికల్ పట్టణంలో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు దసరా పర్వదినాన్ని ఉత్సాహ పూరిత వాతావరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గుడి కోట వద్ద దుర్గ పూజ అనంతరం శావ తో ర్యాలీగా వెళ్లి శివాజీ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన జమ్మి చెట్టుకు పూజ అనంతరం దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ కుల వృత్తుల వారు,పోలీసులు శాస్త్రయుక్తంగా ఆయుధ పూజ నిర్వహించారు.విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దుర్గాదేవి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి రాయికల్ బస్టాండు,శివాజీ చౌక్, కొండా లక్ష్మణ్ బాపూజీ చౌక్, పటేల్ విగ్రహం వద్ద రావణ దహనం కార్యక్రమాన్ని చేపట్టారు.మిత్రులు, శ్రేయోభిలాషులకు జమ్మి ఆకు పంచుకొని ఆలింగనం చేసుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం వందలాదిగా తరలివచ్చిన జనం కేరింతల మధ్య పెద్ద ఎత్తున బాణసంచా పేలుళ్లతో పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాయికల్ పట్టణంలో మున్సిపల్ పాలకవర్గం దసరా ఉత్సవాలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్,వైస్ చైర్మన్ తురగ సౌజన్య,కౌన్సిలర్లు తోపారపు ప్రవంతి సురేష్,రాకేష్ నాయక్ నాయక్, కూనారపు మానస భూమేష్, వేముల మౌనిక రాము,ఏలిగేటి లతిక అనిల్, పల్లికొండ గంగాధర్,బత్తిని మహేశ్వరి నాగరాజు,మచ్చ గంగ లక్ష్మి,పురె శ్రీధర్,కల్లెడ ధర్మపురి, కోఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్,మహేష్,సుధ వేణి లత మురళి, ఇంతియాజ్ పర్వీన్,నాయకులు తురగ శ్రీధర్,మచ్చ శేఖర్,గ్రామ పెద్దలు,మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థంభంపల్లి జిపి సిబ్బందికి దుస్తుల పంపిణి



**చురకలు, విలేఖరి,వెల్గటూర్, అక్టోబర్ 21 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి గ్రామపంచాయితీ సిబ్బందికి విజయదశమి పర్వదినం పురస్కరించుకొని సర్పంచ్, రాజయ్య, ఉపసర్పంచ్ గంగరాజాం ఆధ్వర్యంలో కోత దుస్తులు పంపిణిచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ లింగయ్య, నాయకులు హరి ప్రశాంత్, కిరీటి, పవన్, రాజయ్య, లక్ష్మణ్, సురేందర్, రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబా 108వ పుణ్యతిథి వేడుకలు



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 21 :** జగిత్యాల జిల్లా కేంద్రంలో శ్రీ గుట్ట రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో గల శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం సాయిబాబా 108 వ పుణ్యతిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆస్థాన అర్చకులు గుంటి నిరంజన్ పర్యవేక్షణలో ఉదయం నుండి బాబా ప్రతిమకు భక్తులు పాలాభిషేకం గావించి,మహిళలు విశేష పూజలు, భజనలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.అనంతరం బాబా వారికి వేద పండితులచే విశేష హారతి చేశారు.భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, పల్లెర్ల శంకర్ రావు, ఉటూరి భాస్కర్,నరేందుల అమర్,కొత్తపల్లి శ్రీనివాస్,లక్ష్మి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.స్థానిక కృష్ణా నగర్ లో గల శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయం లో కూడా బాబా 108వ పుణ్యతిథి వేడుకలు ఘనంగా చేశారు. డా. సతీష్ కుమార్, మార కైలాసం,నాగుల కిషన్ గౌడ్,రాం కిషన్ రావు, తిరుపతి గౌడ్, పూజారి గుండయ్య పాల్గొన్నారు.

## వెల్గటూర్ మండలంలో ఘనంగా దసరా ఉత్సవాలు





**చురకలు,విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 21 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో మంగళవారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వెల్గటూర్ మండల కేంద్రంలో దుర్గా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా దసరా రోజు దుర్గాదేవిని ఊరేగించి సాయంత్రం రావణదహన కార్యక్రమం నిర్వహించడం తోపాటు శమీ పూజ కార్యక్రమం జరిపారు. స్థంభంపల్లి గ్రామంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శామీపూజతోపాటు గుట్టపై నున్న స్వయంభూ వెంకటేశ్వ ర స్వామి ఆలయంనుండి ఉత్సవమూర్థులతో సాయంత్రం గ్రామంలో శావా నిర్వహించడంతో ప్రజలు స్వామివారికి మంగళహార తులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. చెదురుమొదురు సంఘటన లు మినహా దసరా పండుగ వెల్గటూర్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

**- రిమాండ్‌కు తరలించిన ఇబ్రహీంపట్నం పోలీసులు**

**- పాత గొడవల నేపథ్యంలో బీర్ బాటిల్‌తో దాడి**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (21) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పాత గొడవలను మనసులో పెట్టుకొని ఇద్దరు యువకులపై బీర్ బాటిల్‌తో దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.ఇబ్రహింపట్నం ఎస్ ఐ నవిన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన పిట్ల సాయికృష్ణ (21), సాగర్ కుమారుడు, ఈ నెల 20వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో పాత గొడవల నేపథ్యంలో అదే ప్రాంతానికి చెందిన మేడి రిత్విక్ అలియాస్ మింటు (23), రాజేందర్ కుమారుడు, సుంకేం నరేష్ (23), చిన్న నర్సయ్య కుమారుడిపై దాడి చేసేందుకు బీర్ బాటిల్‌తో వెళ్లాడు. ఈ క్రమంలో రిత్విక్ తప్పించుకోగా, నరేష్ తలపై బీర్ బాటిల్‌తో బలంగా కొట్టడంతో రక్తగాయమైంది. బాధితుడు సుంకేం నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు సాయికృష్ణ కోసం గాలిస్తుండగా, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జమ్మిగద్దె సమీపంలో ఉన్న మున్నూరుకాపు సంఘ భవనంలో తలదాచుకున్నట్లు సమాచారం తో పోలీసులు అక్కడికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి, నిందితుడిని అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ ఐ నవీన్ కుమార్ తెలిపారు.

## స్థంభంపల్లి జిపి సిబ్బందికి దుస్తుల పంపిణి



**చురకలు,విలేఖరి,వెల్గటూర్, అక్టోబర్ 21 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి గ్రామపంచాయితీ సిబ్బందికి విజయదశమి పర్వదినం పురస్కరించుకొని సర్పంచ్, రాజయ్య, ఉపసర్పంచ్ గంగరాజాం ఆధ్వర్యంలో కోత దుస్తులు పంపిణిచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ లింగయ్య, నాయకులు హరి ప్రశాంత్, కిరీటి, పవన్, రాజయ్య, లక్ష్మణ్, సురేందర్, రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో సురక్షిత ప్రసవం

**-సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లీబిడ్డలను కాపాడిన సిబ్బంది**



**చురకలు ప్రతినిది ఎల్లారెడ్డిపేట,ఆక్టోబర్ 21 :** గర్భిణికి మార్గమధ్యలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి అంబులెన్స్‌లోనే సురక్షితంగా ప్రసవం చేశారు. ఈ ఘటన గంభీరావుపేట మండలంలో చోటుచేసుకుంది. గంభీరావుపేట మండలం లోని కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ నస్రీన్ అనే గర్భిణికి మంగళవారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలించేందుకు బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో పరిస్థితిని గమనించిన అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు (ఈఎంటీ) చెలిమెల సాయికృష్ణ, పైలట్ మనోజ్ కుమార్ అప్రమత్తమయ్యారు. అత్యవసర పరిస్థితిని గుర్తించి సమయస్ఫూర్తితో వ్యవహరించిన సిబ్బంది అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. షేక్ నస్రీన్ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు. అనంతరం తల్లీబిడ్డలను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర సమయంలో వెంటనే స్పందించి సురక్షిత ప్రసవానికి సహకరించిన 108 అంబులెన్స్ సిబ్బందిని గర్భిణి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

# నోటి పాటలకు దూరంగా బతుకమ్మ ..!

**-ఒకప్పుడు చప్పట్లతో సందడి.. నేడు డీజేల హోరు**

**-పల్లె పాటలకు కాలం చెల్లిందా..?**

**-బతుకమ్మకు డీజే లేకుంటే నిమజ్జనానికి కదలని పరిస్థితి**





**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (21) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రూపురేఖలు మారుతున్నాయా..? తరతరాలుగా మహిళల గొంతుల్లో పలికిన జానపద బతుకమ్మ పాటలు క్రమంగా కనుమరుగవుతున్నాయా..? ఒకప్పుడు చప్పట్లు కొడుతూ, గొంతు కలుపుతూ పాడిన పాటల స్థానాన్ని నేడు డీజేల హోరు ఆక్రమిస్తోందా..?పూల పండుగగా, ఆడబిడ్డల ఆత్మీయ వేడుకగా పేరుగాంచిన బతుకమ్మలో ఆధునిక హంగులు పెరుగుతున్నా, అసలైన సంప్రదాయాలకు ప్రాధాన్యం తగ్గుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**నాడు నోటి పాటలతో పల్లెల్లో సందడి...**

ఒకప్పుడు బతుకమ్మ పండుగ వచ్చిందంటే పల్లెల్లో ప్రత్యేకమైన సందడి కనిపించేది. మహిళలు, యువతులు తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలను సేకరించి బతుకమ్మలను అందంగా పేర్చేవారు. సాయంత్రం వేళ గ్రామంలోని ఒకచోట చేరి బతుకమ్మల చుట్టూ వలయంగా నిలబడి చప్పట్లు కొడుతూ సంప్రదాయ పాటలు పాడేవారు. ఒకరు పాట అందుకుంటే మిగతావారంతా గొంతు కలిపేవారు. ఆ పాటల్లో పుట్టింటి అనుబంధం, కుటుంబ బాంధవ్యాలు, ప్రకృతి అందాలు, మహిళల జీవన అనుభవాలు ప్రతిబింబించేవి.ఎలాంటి మైకులు, డీజేలు లేకున్నా మహిళల గొంతులే పల్లెలకు సంగీతాన్ని అందించేవి. చప్పట్లే తాళంగా, అడుగులే నాట్యంగా బతుకమ్మ వేడుకలు సాగేవి. పెద్దవాళ్లు పాడిన పాటలను చిన్నపిల్లలు నేర్చుకుంటూ ఒక తరం నుంచి మరో తరానికి ఆ సంప్రదాయాన్ని అందించేవారు. బతుకమ్మ ఆట అనేది కేవలం వినోదం కాదు.. మహిళల ఐక్యతకు, తెలంగాణ జానపద వారసత్వానికి ప్రతిబింబంగా నిలిచేది.

**నేడు డీజేల మోత.. పాటల సంప్రదాయానికి దూరం..**

కాలం మారింది.. పండుగల నిర్వహణలోనూ మార్పులు వచ్చాయి. బతుకమ్మ వేడుకల్లో డీజేలు, భారీ సౌండ్ సిస్టమ్‌లు, సినిమా పాటలు ప్రధాన ఆకర్షణగా మారుతున్నాయి. సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడాల్సిన చోట డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేయడం ఎక్కువగా కనిపిస్తోంది.పాత పాటలు తెలిసిన పెద్దవాళ్లు ఉన్నప్పటికీ, వాటిని నేర్చుకోవాలనే ఆసక్తి యువతలో తగ్గుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది .బతుకమ్మ చుట్టూ చేరి పాటలు పాడే దృశ్యాలు కనిపించాల్సిన చోట డీజే వాహనాల చుట్టూ యువత సందడి చేస్తోంది. పండుగలో ఉత్సాహం కనిపిస్తున్నా, ఆ ఉత్సాహానికి ప్రాణమైన సంప్రదాయ పాటలకు తగిన స్థానం దక్కడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఆధునికతను స్వాగతించడం తప్పు కాకపోయినా, దాని ప్రభావంతో మన సంస్కృతిలోని ప్రత్యేకతను కోల్పోవడం మాత్రం ఆలోచించాల్సిన విషయమే.

**నిమజ్జనంలోనూ అదే తీరు..**

బతుకమ్మ నిమజ్జన వేడుకల్లోనూ డీజేల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో మహిళలు బతుకమ్మలను చేతబట్టి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ చెరువుల వైపు వెళ్లేవారు. నేడు కొన్ని చోట్ల డీజే వాహనాల హడావుడి, సినిమా పాటల హోరు నిమజ్జన వేడుకల్లో ప్రధానంగా కనిపిస్తున్నాయి. డీజే లేకుంటే నిమజ్జనానికి వెళ్లేందుకు ఆసక్తి తగ్గుతున్నట్లు కనిపించే పరిస్థితులపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మ నిమజ్జనం అంటే పూలను నీటిలో వదిలేయడం మాత్రమే కాదు. ప్రకృతిని ఆరాధించడం, మహిళలు కలిసి ఆనందాన్ని పంచుకోవడం, సంప్రదాయాన్ని గౌరవించడం కూడా. కానీ డీజే శబ్దాల మధ్య పాటల సాహిత్యం వినిపించకపోవడం, సంప్రదాయ ఆటలకు ప్రాధాన్యం తగ్గడం పండుగ అసలు ఉద్దేశాన్ని గుర్తుచేసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది.

**భావితరాలకు బతుకమ్మ పాటలు అందించేదెవరు..?**

ఇప్పటి పిల్లలకు బతుకమ్మ పాటలు నేర్పించకపోతే రేపటి తరానికి ఆ పాటల గురించి తెలిసేదెలా?పెద్దలు పాడే పాటలను చిన్నవారు నేర్చుకోవడం ,పాత జానపద గీతాలను తిరిగి పాడటం,మహిళలు సంప్రదాయ ఆటలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. గ్రామాల్లో బతుకమ్మ వేడుకల సందర్భంగా సంప్రదాయ పాటల పోటీలు నిర్వహించడం, పెద్దవారితో పాటలు పాడించడం, యువతకు వాటి అర్థాలను వివరించడం ద్వారా ఈ వారసత్వాన్ని కాపాడుకోవచ్చు.డీజేలు పూర్తిగా వద్దనడం కాదు.. వాటికి పరిమితులు పాటిస్తూ, సంప్రదాయ పాటలకు సముచిత స్థానం కల్పించాలన్నదే ప్రధాన ఉద్దేశం. పండుగలో ఆధునికత ఉండాలి.. అదే సమయంలో మన మూలాలు కూడా నిలవాలి. ఆనందోత్సాహాల మధ్య తెలంగాణ సంస్కృతి మరుగున పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

**బతుకమ్మ అంటే పాట.. బతుకమ్మ అంటే సంప్రదాయం..!**

బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, పూల పండుగ వైభవానికి ప్రతీక. దాని ప్రత్యేకత భారీ సౌండ్ సిస్టమ్‌లలోనో, డీజే పాటల హోరులోనో లేదు. తరతరాలుగా మహిళల గొంతుల్లో వినిపించిన జానపద గీతాల్లో, చప్పట్ల తాళంలో, కలిసిమెలిసి ఆడే ఆటల్లో ఉంది. ఆ సంప్రదాయాన్ని మళ్లీ బతికించాల్సిన సమయం ఆసన్నమైంది.డీజేల మోతలో బతుకమ్మ పాటల గొంతు మూగబోకూడదు.. ఆధునికత ముసుగులో తెలంగాణ జానపద వారసత్వం కనుమరుగు కాకూడదు. పూలతో బతుకమ్మను పేర్చినట్లే.. పాటలతో సంప్రదాయాన్ని పేర్చి భావితరాలకు అందించాలి. అప్పుడే బతుకమ్మ పండుగకు అసలైన అందం, అర్థం, వైభవం చేకూరుతాయి.

# పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**-బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు**



**చురకలు విలేకరి, మెట్ పల్లి, అక్టోబర్ 21 :** పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు హెచ్చరించారు. బుధవారం మెట్ పల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల క్రితం వాట్సాప్ గ్రూపులో ఎంపీ ధర్మపురి అరవింద్ ఫొటోతో ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో మంజూరైన హైమాస్ లైట్ల విషయంలో అవినీతి జరిగిందంటూ ప్రచారం జరిగినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై వివరణ కోరుతూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని, లేనిపక్షంలో పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నరేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సుదవేని మహేష్, పార్లమెంట్ కో-కన్వీనర్ గుంటుక సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులు బాగుంటేనే ఊరు బాగుంటది

### -ఉపసర్పంచ్ జజ్జరి దెవెంధర్ ముదిరాజ్

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 21 :** పారిశుధ్య కార్మికులు బాగుంటేనే మన ఊరు బాగుంటదనే సదుద్దేశంతో తిమ్మాపూర్ ఉపసర్పంచ్ జజ్జరి దేవేందర్, విజయదశమి సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ కార్మికులకు తన సొంత ఖర్చులతో బట్టలను పంపిణీ జేశారు.అదేవిధంగా తిమ్మాపూర్ గ్రామంలో బతుకమ్మ పండుగ సందర్భంగా ఉప సర్పంచ్ దేవెందర్,తన సంతకర్చులతో ఎన్నడు లేని విధంగా ఊర్లో లైటింగ్ ఏర్పాటు చేసి చెరువు వద్ద కుడి కుంట చెరువు వద్ద మహిళలు ఇబ్బంది పడకుండా లైటింగ్ ఏర్పాటు చేశారు.మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ పండగ సంబరాలను జరుపుకున్నారు ఇట్టి



కార్యక్రమంలో ఉపసర్పంచ్ జజ్జరి దేవేందర్,పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆటపాటలతో ఘనంగా జరుపుకున్నారు మనం కూడా బాగుంటామని సిబ్బంది ఉదయం లేవగానే ఎన్నో పనులు చేస్తారు కాబట్టి వాళ్లు బాగుండాలని వాళ్ళ కుటుంబాలు బాగుండాలని కోరుకుంటు అందుకు సిబ్బందికి విజయ దశమి సందర్భంగా తిమ్మాపూర్ గ్రామ ఉపసర్పంచ్ జజ్జరి దేవేందర్, గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులకు తోచినంత బట్టలు పెట్టడం జరిగింది తిమ్మాపూర్ గ్రామ పెద్దలకు తమ్ముళ్లకు అక్కలకు మరియు నాతోటి యువకులకు అందరికీ ఉప సర్పంచ్ జజ్జరి దేవేందర్, విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు, అదేవిధంగా తిమ్మాపూర్ గ్రామస్తులు ఉప సర్పంచ్ డాక్టర్ జజ్జరి దేవేందర్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.



# ఎల్లారెడ్డి పేట మండలంలో దసరా వేడుకలు

### -గ్రామగ్రామాన శమీ పూజలు.. మండల కేంద్రంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి గరుడోత్సవం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆక్టోబర్ (21) :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో విజయదశమి పండుగ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు సంప్రదాయబద్ధంగా శమీ పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేస్తూ దసరా పండుగను సరదాగా జరుపుకున్నారు. పాలపిట్టను దర్శించుకుని మొక్కులు చెల్లించుకొని ఒకరికొకరు జమ్మి ఆకులను బంగారంగా పంచుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**ఘనంగా శమీ పూజలు..ఆయుధ పూజ.**

దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని ఆలయాలు, పూజా ప్రదేశాల వద్ద ప్రజలు శమీ పూజలు నిర్వహించారు. తమకు, తమ కుటుంబాలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు ఆయుధ పూజ నిర్వహించారు.విధి నిర్వహణలో ప్రజలకు ఎల్లప్పుడూ రక్షణ కల్పించాలని ఆకాంక్షిస్తూ సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.

**జమ్మి బంగారం పంచుకుంటూ శుభాకాంక్షలు**

విజయదశమి సందర్భంగా ప్రజలు జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు సమర్పించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. స్నేహితులు,బంధువులు, ఆత్మీయులు ఒకరికొకరు జమ్మి ఆకుల ను అందజేస్తూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఉప సర్పంచ్ బందారపు బాల్రెడ్డి జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య,సింగల్ విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి,రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి,నాయకులు బండారి బాల్ రెడ్డి,మీసం రాజం,గుండాడి వెంకట్ రెడ్డి,ముత్యాల ప్రభాకర్‌రెడ్డి,సందుపట్ల లక్ష్మారెడ్డి,వివిధ కులసంఘాల ప్రతి నిదులు వార్డు సభ్యులు విజయాలు కలగాలని గ్రామం పురోహితులు రాచర్ల దయానంద శర్మ రాచర్ల హనుమాన్లశర్మ ,ఆలయ పురోహితులు బీట్కూరిగోపాల చార్యులు నవీన్‌చార్యులు ప్రజాప్రతి నిధులకు కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ పార్టీల నాయకులకు గ్రామస్తులకు ఆశీర్వాదాలు అందజేశారు.

**పటిష్ట పోలీసు బందోబస్తు.**

దసరా వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ వెంకటేష్ ఎస్సై రమేష్ గౌడ్ ల ఆధ్వర్యంలో పోలీసులు ఆయా గ్రామాల్లో బందోబస్తు నిర్వహించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకునేలా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో మండలవ్యాప్తంగా దసరా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.



# డాక్టర్ స్వామికి అమ్మవారి ఫోటో బహుకరణ

**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట ఆక్టోబర్ 21 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని ఏర్పాటు చేసి నిత్య పూజలు నిర్వహించారు.. ఇవాళ అమ్మవారి నిమజ్జనం సందర్భంగా దుర్గామాత చిత్రపటాన్ని అశ్విని



హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ సత్యనారాయణ స్వామికి యూత్ సభ్యులు వద్నాల భాస్కర్ నంది నరేష్ జవాజి సంజీవ్ తదితరులు కలిసి ఫోటోతో పాటు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

# రాష్ట్ర ఉపాధ్యక్షులకు ఆర్జి 3 జీఎం సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 21 :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన అనంతుల రాజును రామగుండం రీజన్ 3 జనరల్ మేనేజర్ మధుసూదన్ శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు బుధవారం సెంటినరీ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం లో పలు పూజలు నిర్వహించిన అనంతరం శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు రాష్ట్రస్థాయిలో ఉపాధ్యక్షుడు నియమితులు కావడం అభినందనీయమన్నారు పలు సేవా కార్యక్రమాలు ను నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాలో పూజారి వేదాంతం విజయరామ శర్మ శివ పెద్దపెల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు నలమాచు ప్రభాకర్ సింగరేణి అధికారులు కోలా శ్రీనివాస రాంరెడ్డి ఆర్యవైశ్య సంఘం నాయకులు రావి కంటి గుండయ్య దొంతులసురేష్ ముస్త్యాల శ్రీనివాస్ ఎల్లంకి వంశీ కొమురవెల్లి విజయ్ కుమార్ రావికంటి సతీష్ కుమార్ కొత్త శ్రీనివాస్ కేశెట్టి శ్రీనివాస్ గుండ శ్రీనివాస్ కొమురవెల్లి వెంకటరమణలు పాల్గొన్నారు.

# ఘనంగా దుర్గాదేవి శరన్నవరాత్రులు



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ అక్టోబర్ 21 :** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూరులో శ్రీ విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న అమ్మవారి మహా కలశాన్ని నిర్వహించిన వేలంలో అలుగునూరుకు చెందిన సిరిసిల్ల సుశీల-శంకర్ దంపతులు రూ.51 వేలతో దక్కించుకున్నారు.గత నాలుగేళ్లుగా వరుసగా ఈ దంపతులే మహా కలశాన్ని దక్కించుకోవడం విశేషం. అమ్మవారి ఆశీస్సులతో నవరాత్రి పూజలు అందుకున్న కలశాన్ని సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందని శంకర్ తెలిపారు.తన కుటుంబంతో పాటు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.ఈసారి అలుగునూరులోని పలు దుర్గాదేవి మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, సుమారు యాభై ఒక్కవేల విలువైన స్కూటీని బహుమతిగా అందజేసినట్లు వెల్లడించారు.

# అనాథకు అంత్యక్రియలు నిర్వహించిన రిటైర్డ్ ఏఎస్ఐ

**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 21 :** జగిత్యాల రాజేశం గుట్టలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమంలో ఉంటున్న శ్రీనివాస్ అనే అనాథ వ్యక్తి మృతి చెందాడు. తొమ్మిది నెలల క్రితం మతిస్థిమితం లేక రోడ్లపై తిరుగుతున్న



అతడిని ఆశ్రమంలో చేర్చారు. బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందగా, ఆశ్రమ అధ్యక్షుడు రిటైర్డ్ ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్ వైకుంఠ రథం ఏర్పాటు చేసి చింతకుంట శ్మశానంలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగు రాజయ్య, కప్పల చంద్రమౌళి, మోటూరి నాగలింగం పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్ మృతికి ఎస్పీ ఘన నివాళులు



**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 21 :** నిర్మల్ జిల్లా పోలీస్ శాఖలో విషాదం నెలకొంది. ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గడపలే బాబు (హెచ్.సి. 2228) విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా, గత రాత్రి భైంసా పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. ఆయన మృతి పట్ల పోలీస్ అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ గడపలే బాబు స్వగ్రామమైన నిర్మల్ జిల్లా తానూర్ మండలం బెంబేరా గ్రామంలో బుధవారం నిర్వహించిన అంత్యక్రియలకు జిల్లా ఎస్పీ జానకి షర్మిల హాజరయ్యారు.ఆయన పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి బాధను పంచుకున్నారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,పోలీస్ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు.ఎస్పీ మాట్లాడుతూ, హెడ్ కానిస్టేబుల్ గడపలే బాబు మృతి పోలీస్ శాఖకు తీరని లోటని పేర్కొన్నారు.ఆయన అందించిన సేవలు పోలీస్ శాఖకు చిరస్మరణీయమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయికిరణ్, ముధోల్ సీఐ రవీందర్ నాయక్, తానూర్ ఎస్ఐ షేక్ జుబేర్ ఖాన్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దండేకర్ సాయికుమార్, పోలీస్ సిబ్బంది, బంధుమిత్రులు పాల్గొని గడపలే బాబుకు నివాళు లర్పించారు

# నిర్మల్‌లో చైర్మన్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 21 :** నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అషు ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైర్మన్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐకమత్యం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు. చైర్మన్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్పీ రాజు, కత్తి నరేందర్, ఆకుల రామకృష్ణ, లక్కాకుల హరీష్, మాజీ కౌన్సిలర్ ధర్మాజీ గారి శ్రీనివాస్, డీసీసీ జనరల్ సెక్రటరీ జునైద్ మెమన్, సయ్యద్ అర్షద్, మొహమ్మద్ అతేషామ్, ఫహీం ఖాన్, సోహెల్, మన్సూర్, అజీమ్, నవీద్, రోహిత్, సాయి, అల్మాస్, వంశీ, టోర్నమెంట్ ఆర్గనైజర్ సయ్యద్ రేహాన్, అన్వర్ ఖాన్, సోను తదితరులు పాల్గొన్నారు

# మృతునికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్, అక్టోబర్ 21 :** కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు తండ్రి వైనాలసాంబయ్య(72)బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్,గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ సాంబయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాంబయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. వైనాల సాంబయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో గడప కృష్ణ మూర్తి,ఉపసర్పంచ్ రఫీక్ సోహెల్, నగునూరి నర్సయ్య గౌడ్,మల్యాల మహేష్ గౌడ్ , యూసుఫ్ లల్లు, సయ్యద్ నజీబ్, మహమ్మద్ అఫ్రోజ్, ఇర్ఫాన్,అజార్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



# రిటైర్డ్ సింగరేణి కార్మికుడు ఆత్మహత్య



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్, అక్టోబర్ 21 :** కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన వైనాల సాంబయ్య (72) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు బుధవారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సాంబయ్య తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కమాన్ పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్ధమ్ కోసం గోదావరి ఖని ప్రభుత్వ ఆసుపత్రికీ తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

**నేత్రాలు దానం..!**

మృతుడు వైనాల సాంబయ్య నెత్రాలను దానం చేసేందుకు కుమారులు వైనాల రాజు, వినోద్, కుమార్తె లావణ్యతో పాటు కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో సదాశయ పౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ ఆధ్వర్యంలో నెత్రాలను సేకరించి హైదరాబాద్ కు తరలించారు. సాంబయ్య మృతి చెందిన తన నెత్రాలతో మరో ఇద్దరికీ చూపు వచ్చే అవకాశం ఉంది. నేత్రాలు దానం చేసిన సాంబయ్య కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారని సదాశయ పౌండేషన్, లయన్స్ క్లబ్ సభ్యులు, పలువురు రాజకీయ నాయకులు అభినందించారు.

## మిత్రుడి కుటుంబానికి రూ. 1.86లక్షల ఆర్థిక సాయం



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 21 :** ఇటీవల మృతి చెందిన వీణవంక మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన ఉడుత సునీల్ కుటుంబానికి మిత్రులు,దాతలు అండగా నిలిచారు. సునీల్ మృతితో దిక్కుతోచని స్థితిలో ఉన్న అతని ముగ్గురు కుమార్తెలు,భార్యను ఆదుకునేందుకు పదో తరగతి, ఇంటర్మీడియట్ సహచర మిత్రులు ముందుకొచ్చారు.సోషల్ మీడియా (వాట్సాప్) వేదికగా చేపట్టిన పిలుపునకు పలువురు దాతలు పెద్ద మనసుతో స్పందించడం తో మొత్తం రూ. 1,86,000 ఆర్థిక సాయాన్ని సమీకరించి బాధిత కుటుంబానికి అందజేశారు.కష్టకాలంలో తోడుగా నిలిచి నిజమైన స్నేహబంధం విలువను, మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా సహకరించిన మిత్రులకు,దాతలకు సునీల్ కుటుంబసభ్యులు, స్నేహితులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## పరామర్శించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 21 :** కమాన్‌పూర్ మండల కేంద్రంలో పలు మృతుల కుటుంబాలను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ పరామర్శించారు.స్థానిక మండల కేంద్రంలోని ఇస్లాంపూరకు చెందిన మహమ్మద్ అబ్బు, వలి హైదర్,ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వాళ్ల కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించిన కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ఎస్ అన్వర్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారితో పాటు సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్,ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్యాల మహేష్ గౌడ్,యూసఫ్ లల్లు,సయ్యద్ నజీబ్, మహమ్మద్ అఫ్రోజ్,ఇర్ఫాన్,అజార్, తదితరులు మృతుల కుటుంబాలకు మనోధర్యం కల్పించారు,

## ఎంపీ అరవింద్‌ను కలిసిన బీజేపీ నాయకులు



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 21 :** బీజేపీ జగిత్యాల పట్టణ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కాశెట్టి తిరుపతి, జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్‌గా నియమితులైన సిరిపురం శ్రీనివాస్ బుధవారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌ను నిజామాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ కు నాయకులు దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్,మాజీ పట్టణ అధ్యక్షుడు రంగుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దసరా వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 21 :** కమాన్‌పూర్ మండలంలో గుండారం,జూలపల్లి,వీరా పల్లి,రొంపి కుంట,నాగారం, పెంచికలపేట, గ్రామాల్లోదసరా వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కమాన్ పూర్ మండలంలో శమీ పూజ నిర్వహించి, శమీ పూజలో ప్రజలు ఘనంగా పాల్గొన్నారు.విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని, ప్రతి కుటుంబం అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించడం జరిగింది. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ, జూలపల్లి సర్పంచ్ పోల్ దాసరి వనిత సాయికుమార్, పొనగంటి కుమార్, బొంగోని సదయ్య గౌడ్,ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ సోహెల్,కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబీర్ శ్రీనివాస్, నగునూరి నర్సయ్య గౌడ్ మల్యాల మహేష్,సయ్యద్ ఇక్బాల్,యూసుఫ్ లల్లు, మెదగొని శ్రీనివాస్,రంగు శ్రీనివాస్, ఆరెల్లి శ్రీనివాస్,నూతి కుమారస్వామి, జంగపల్లి ఎల్లయ్య,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌కు ఆత్మీయ సన్మానం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 21 :** దసరా పండుగను పురస్కరించుకొని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలోని వాసవి మాత ఆలయాన్ని గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన ఆర్యవైశ్య సోదర సోదరీమణులను కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.పండుగలు సమాజంలో ఐక్యతను, పరస్పర ఆత్మీయతను పెంపొందిస్తాయని పేర్కొంటూ, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కొండ రమేష్ గౌడ్‌ను ఆర్యవైశ్య సోదర సోదరీమణులు ఆత్మీయంగా సన్మానించారు.పండుగ వేళ ఆలయాన్ని సందర్శించి శుభాకాంక్షలు తెలిపినందుకు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో, పరస్పర ఆప్యాయతల మధ్య సాగింది.

## స్వామివారిని దర్శించుకున్న సివిల్ జడ్జి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 21 :** కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆది వరహాస్వామిని మహబూబ్నగర్ జూనియర్ సివిల్ జడ్జి అవినాష్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ డైరెక్టర్లు భూష శ్రీనివాస్ గౌడ్, కొంతం శ్రీనివాస్ ముదిరాజ్ లు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి వద్ద ప్రత్యేక పూజలను అర్చకులు రామానుజ చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం కావించారు. గుర్తుగా స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి శాలువతో సత్కరించారు. స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని జడ్జి పేర్కొన్నారు.

# నిర్మల్‌లో పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు

**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్ 21 :** నిర్మల్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల అమరవీరుల స్మారక స్తూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, దేశ సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని రక్షిస్తే, రాష్ట్రంలో అంతర్గత భద్రతను కాపాడుతూ ప్రజలకు రక్షణ, భరోసా కల్పించేది పోలీసులని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విధి



నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో చైనా సైనికులతో జరిగిన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన సీఆర్‌పీఎఫ్ జవాన్ల త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి కుటుంబాలకు అండగా నిలవడం, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు,సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగాపరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చి జ్ఞాపికలను అందజేశారు. ఈ ఏడాది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల పేర్లతో కూడిన రోల్ ఆఫ్ హానర్ను అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి చదివి వినిపించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది అమరవీరుల స్మారక స్తూపం వద్ద పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల,అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్,నిర్మల్ డీఎస్పీ పి.శ్రీనివాస్,సీఐలు,ఆర్ఐలు, ఎస్ఐలు,ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# హుజురాబాద్లో "విజయదశమి" సక్సెస్

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 21 :** హుజురాబాద్ లో విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో జరిగిన వేడుకలకు పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. రావణాసుర వధ కార్యక్రమం, జమ్మి పూజ కార్యక్రమాలు స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగాయి. పెద్ద ఎత్తున పట్టణ ప్రజలు హాజరయ్యారు. స్థానిక శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి శాలిని దంపతులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గ ప్రజలకు వారు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన హుజురాబాద్ ప్రాంతవాసులు ఇక్కడికి చేరుకున్నారు. ఒకరికొకరు కలుసుకొని



జమ్మి ఇచ్చుకొని ఆనందాన్ని పంచుకున్నారు. వేదికపై జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని కట్టిపడేసాయి. మహిళలు చిన్నారులు యువత కేరింతల మధ్య రావణాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుర్ర నటరాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అలాగే మున్సిపాలిటీ చైర్ పర్సన్ ఆర్ సుహాసిని, కమిషనర్ బి కిషన్, కౌన్సిలర్లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమానికి సహకరించిన అందరికీ చైర్పర్సన్ సుహాసిని, కమిషనర్ కిషన్ కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసిపి వాసంశెట్టి మాధవి, సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ దసరాను పురస్కరించుకొని ఆయుధ పూజ జమ్మి పూజ కార్యక్రమాలు జరిగాయి.



### స్మృతి తరంగాలు...

# మన 'సహాయ' మిత్రుడు రాజిరెడ్డికి అశ్రునివాళి

**చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డి పేట అక్టోబర్ 21 :**

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు, కానీ కొన్నిసార్లు అది మిగిల్చే గాయాలు మానవుల ఊహకు అందవు. గత ఇరవై ఏళ్లుగా దసరా మరుసటి రోజున మనమంతా ఒకచోట చేరి, పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ,ఎల్లారెడ్డిపేట 'సహాయ ఫౌండేషన్' ద్వారా సమాజానికి ఏదో ఒకటి చేయాలనే తపనతో సాగిన మన ప్రయాణంలో ఈరోజు ఒక పెద్ద శూన్యం ఆవరించింది.ఎప్పుడూ మనతో ఉంటూ, మన నవ్వుల్లో భాగస్వామియైన మన తోటి మిత్రుడు సందుపట్ల రాజిరెడ్డి నేడు మన మధ్య లేరనే నిజాన్ని నమ్మడం మనసుకి ఎంతో భారంగా ఉంది.పోయిన ఏడాది సరిగ్గా



ఇదే సమయానికి రాజిరెడ్డి మనతోనే ఉన్నాడు. మన భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడాడు, కలిసి నవ్వాడు, పాత స్కూల్ రోజులను గుర్తుచేసుకున్నాడు.కానీ, ఈ ఏడాది ఆ స్థానం ఖాళీగా దర్శనమిస్తోంది. విధి ఆయన్ను మన నుంచి ఇంత త్వరగా దూరం చేస్తుందని ఎవరూ ఊహించలేదు. క్లాస్‌రూమ్ జ్ఞాపకాల నుండి మొదలైన మన 1995-96 ఎస్ఎస్‌సి బంధం, ఫౌండేషన్ రూపంలో ఇంత సుదీర్ఘంగా సాగడానికి రాజిరెడ్డి లాంటి స్నేహితుల తోడ్పాటు ఎంతో అమూల్యమైనది.ఈ రోజు మన 'సహాయ ఫౌండేషన్' వేదికపై ఆయన చిత్రపటానికి కొవ్వొత్తి వెలిగించి, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళు లర్పిస్తున్నప్పుడు.. ప్రతి ఒక్కరి కళ్లలో నీళ్లు తిరగక మానవు. ఆయన భౌతికంగా మనకు దూరమైనా, మన మనసుల్లో ఆయన జ్ఞాపకాలు, ఆయన చూపిన స్నేహానురాగాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.ఏ లోకాన ఉన్నా మన రాజిరెడ్డి ఆత్మకు సంపూర్ణ శాంతి చేకూరాలని,ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబానికి ఆ భగవంతుడు కొండంత ధైర్యాన్ని ప్రసాదించాలని మన 'సహాయ ఫౌండేషన్' తరపున, 95-96 ఎస్ఎస్‌సి మిత్రులమంతా కలిసి ముక్తకంఠంతో ప్రార్థిస్తున్నాము.

# నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలి

**-డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్)**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 21 :** నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించాలని డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. వారు బుధవారం పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సింగరేణి అడ్రియాల లాంగ్ వాల్, ఓసిపి-2 ఉపరితల గనులను సందర్శించి, నడుస్తున్న పనులను పరిశీలించారు.వారికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావులు స్వాగతం పలికారు. అనంతరం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి తీసుకుంటున్న చర్యల గురించి వారికి వివరించారు. ముందుగా అడ్రియాల లాంగ్ వాల్ గని లోపలికి వెళ్లి నడుస్తున్న పనులను పరిశీలించారు.తదుపరి ఓసిపి -2 ఉపరితల గనిలోకి వెళ్లి యంత్రాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం జి. యం కార్యాలయంలో రామగుండం -3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు వివిధ గనుల, విభాగాల అధిపతులు,అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి భద్రత,ఉత్పత్తి, ఉత్పాదకత,బొగ్గు రవాణా మొదలగు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ గారు మాట్లాడుతూ నిర్దేశించిన ఓ.బి,బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో సాధించాలని, అందుకు కావలసిన చర్యలను, ప్రణాళికను రూపొందించుకోవాలని, బొగ్గుఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని,భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని పలు సలహాలు ,సూచనలు ఇచ్చారు.కార్యక్రమంలో ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫ్యాటింగ్, కె.జనార్దన్,ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జి.లక్ష్మీనారాయణ,విభాగాదిపతులు బి.టి.మురళీ కృష్ణ,అఫ్సర్ పాషా, కె.ఐలయ్య,ఆసిఫ్ యాసిన్,మనోజ్ కుమార్,మేనేజర్ భరత్‌కుమార్‌లతో పాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జూలపల్లిలో...

# దుర్గామాత శోభ యాత్ర



**- అమ్మవారిని దర్శించుకున్న పుట్ట మధు**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్, అక్టోబర్ 21 :** కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామంలో హనుమాన్ ఆలాయం వద్ద నవరాత్రోత్సావాల్లో భాగంగా దుర్గాదేవుని ప్రతిష్టించి నిత్య పూజలు నిర్వహించారు. బుధవారం నిమజ్జన కార్యక్రమం సందర్భంగా శోభ యాత్ర ప్రారంభం కార్యక్రమానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దయతో ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, దీక్షపరులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

**-ప్రజల శాంతిభద్రతల కోసం ప్రాణాలర్పించిన వీరుల సేవలు చిరస్మరణీయం**

**-లింగంపేట అమరవీరుల స్తూపం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినం.. నివాళులర్పించిన ఎస్పీ మహేష్ బి. గితే**



**చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 21 :** ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పేర్కొన్నారు. దేశ ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన పోలీసుల సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులతో కలిసి అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

**154 మంది అమరవీరుల పేర్ల పఠనం.**

ఈ సందర్భంగా సాయుధ పోలీసులు సంప్రదాయబద్ధంగా శోక శస్త్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసు అమరవీరుల పేర్లను చదివి వినిపించారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పోలీసులు అనేక క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. అంతర్గత భద్రత పరిరక్షణలో భాగంగా జిల్లాలో ఎనిమిది మందికి పైగా పోలీసులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. వారి త్యాగాల ఫలితంగానే గతంతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితులు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు.అమరవీరుల త్యాగాలను కేవలం సంస్మరణ దినాన మాత్రమే కాకుండా నిత్యం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎన్ని సవాళ్లు ఎదురైనా అమరవీరులు చూపిన తెగువ, నిబద్ధత, సేవాభావం తమకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని చెప్పారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించు కోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం.**

1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. దేశ రక్షణ, అంతర్గత భద్రత, ప్రజల ప్రాణాల పరిరక్షణ కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు వీరుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకుంటామని తెలిపారు.

**అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం.**

కార్యక్రమానికి హాజరైన పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడారు. వారి కుటుంబ పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు విన్నవించిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలను అందజేసి గౌరవించారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి త్యాగాలను గౌరవించడం మనందరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఈ నెల 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు.**

పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు, క్యాండిల్ ర్యాలీలు, రన్ కార్యక్రమాలు,ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు, ఫొటోగ్రఫీ, వీడియో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యువత, విద్యార్థులు, ప్రజలు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించు కోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాస్,వెంకటేశ్వర్లు,సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది,పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



